

రెజ్లింగ్ పోటీలకు అర్చన ఎంపిక

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని కోరంగి పంచాయతీ పాతకోరంగికి చెందిన అరబరుకుల అర్చన జాతీయస్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికైంది. విజయవాడలో జరిగిన ఎపి స్కూల్ గేమ్స్ పోటీల్లో అండర్ 19 రెజ్లింగ్ ఫ్రీ స్టైల్ 72 కేజీల విభాగంలో అర్చన గోల్డ్ మెడల్ సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. హర్యానాలో ఈనెల 28 నుంచి జరిగే జాతీయ స్థాయి పోటీల్లో ఆమె పాల్గొననున్నారు. అర్చనకు పలువురు అభినందనలు తెలిపారు.



పతకాలతో అర్చన

నిర్లక్ష్యంగా 'మిడ్డే మీల్స్' పథకం

-అరకొర వేతనాలతో కార్మికులు వెతలు

-మూడు నెలలుగా పెండింగ్

-చాలీ చాలని బిల్లులతో ఇక్కట్లు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకంగా పేరు మార్పు చేసి అమలు చేస్తున్నప్పటికీ తీరు తెన్నులలో మార్పు మాత్రం కనిపించడం లేదు. నిర్లక్ష్యపు నీడలో ఈ పథకం కొట్టుమిట్టాడుతోందనే విమర్శలు తల్లిదండ్రుల నుంచి వినిపిస్తున్నాయి. జిల్లాలో పలు మండలాల్లో మిడ్డే మిల్ వర్కర్లకు 3 నెలలుగా వేతనాలు అందడం లేదు. ఇప్పటికే అరకొర వేతనాలతో నెట్టుకొస్తున్నారు. కార్మికులు అప్పులు చేసి కుటుంబాలను పోషించుకునే దుస్థితిలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

జిల్లాలో 1,253 పాఠశాలల్లో 1,33,258 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇందులో ప్రైమరీ విద్యార్థులు 36,832 మంది, యూపి విద్యార్థులు 9,552, హైస్కూలు విద్యార్థులు 86,874 మంది ఉన్నారు. జిల్లాలో సుమారు 2,424 మంది కార్మికులున్నారు.



అప్పులు చేసి పోషణ

మధ్యాహ్న భోజన పథకాన్ని సమర్ధవంతంగా అమలు చేయడంతో కార్మికులు తమ వంతు కృషి చేస్తున్నారు. ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నప్పటికీ పేద, మధ్యతరగతి వర్గాల పిల్లలకు పౌష్టికాహారం అందించేందుకు శ్రమిస్తున్నారు. ఈ నేపథ్యంలో వారికిచ్చే అరకొర వేతనాలను సకాలంలో ఇవ్వకపోవడంతో అప్పులు చేసి కుటుంబాలను పోషించుకునే పరిస్థితి ఏర్పడిందనే ఆవేదనలు వారి నుంచి వినిపిస్తున్నాయి. కేవలం రూ.3 వేలతో ఎలా బతకాలనే కార్మికులు ప్రశ్నిస్తున్నారు. గత 3 నెలల నుంచి ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచింది. జిల్లాలో ఉన్న కార్మికులకు నెలకు రూ.72.72 లక్షల వేతనాల ఇవ్వాల్సి ఉంది. ఇలా మొత్తంగా 3 నెలలకు రూ.2 కోట్ల 18 లక్షల 16 వేలు వరకూ వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. అయితే దీనిపై అధికారులను వివరణ కోరితే రెండు నెలల బిల్లులు ఇప్పటికే అప్ లోడ్ చేశామని, కేవలం ఒక నెల మాత్రమే పెండింగ్‌లో ఉన్నట్లు చెబుతున్నారు. కనీస వేతనంగా రూ.26 వేలు ఇవ్వాలని చట్టంలో ఉన్నా ప్రభుత్వం స్కీం వర్కర్లపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ప్రభుత్వమే కార్మికుల శ్రమను దోచుకోవడం శోచనీయమని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వంట బిల్లులకు కలగని మోక్షం

వంట బిల్లుల సైతం పెండింగ్లో ఉండడంతో కిరాణా దుకాణాల వద్ద అరువుపై సరుకులు వండి వడ్డిస్తున్న పరిస్థితులు ఉన్నాయి. బిల్లులు వచ్చిన తర్వాత దుకాణ యజమానులకు వడ్డీలతో సహా చెల్లించే దుస్థితి ఏర్పడిందని వర్కర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం సకాలంలో బిల్లులు విడుదల చేయకపోవడంతో ఈ సమస్య ఏర్పడింది. మూడు నెలలుగా వంట బిల్లులు విడుదల చేయడం లేదు. దీంతో వంట కోసం అనేక అవస్థలు ఎదుర్కొంటున్నామని కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల వద్దే వంట చేస్తున్న కార్మికులకు ప్రతీ నెలా ప్రభుత్వం కుకుంగ్ బిల్లులను విడుదల చేస్తుంది. దీనిలో భాగంగా ప్రాథమిక పాఠశాలలకు రూ. 31 లక్షల 63 వేల 331, యుపి పాఠశాలలకు రూ.41 లక్షల 11 వేల 433, హైస్కూళ్లకు రూ. 30 లక్షల 8 వేల 821ను విడుదల చేయాల్సి ఉంది. ఇవి కూడా దాదాపు మూడు నెలల నుంచి ఇవ్వడం లేదు. మొత్తంగా నెలకు రూ.1 కోటీ 28 లక్షల 3 వేల 585 అయింది. మూడు నెలలకు కలిపి రూ.3 కోట్ల 8 లక్షల 50 వేల 755 బిల్లులు విడుదల కావాల్సి ఉంది. అలాగే మరోవైపు గుడ్లు, చిక్కీల బిల్లులను సైతం ప్రభుత్వం కాంట్రాక్టర్లకు పెండింగ్లో ఉంచింది.

నిర్లక్ష్యం తగదు



మధ్యాహ్న భోజన పథకంపై ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తుంది. కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాల్సి ఉన్నా చట్టాన్ని ఉల్లంఘిస్తున్నది. కాస్తో కూస్తో ఇస్తున్న తక్కువ వేతనాలను పెండింగ్లో ఉంచుతుంది. ఇది సరికాదు. వెంటనే వేతనాలను విడుదల చేయాలి. లేకపోతే ఆందోళన ఉధృతం చేస్తాం.

-సిహెచ్.పద్మ, యూనియన్ జిల్లా నాయకురాలు

పెండింగ్ ఉంటే ఎలా..?



అరకొర వేతనాలతో బతకడం కష్టంగా ఉంది. అయినా సరే తప్పనిసరి పరిస్థితుల్లో మధ్యాహ్నం భోజన పథకంలో పనిచేస్తున్నా ప్రభుత్వం కనీస వేతనాలను అమలు చేయడం లేదు. వంట బిల్లులు మూడు నెలలుగా ఇవ్వడం లేదు. వెంటనే వేతనాలు, వంట బిల్లులను విడుదల చేయాలి.

-అనంత, మిడ్డే మీల్స్ వర్కర్, పెద్దిపాలెం, ప్రత్తిపాడు మండలం



సిఐటియు జిల్లా మహాసభలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు

ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పోరాటాలు

సిఐటియు జిల్లా మహాసభలో నర్శింగరావు పిలుపు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రయివేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలను ఉధృతం చేయాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్శింగరావు పిలుపు నిచ్చారు. సిఐటియు జిల్లా 12వ మహాసభ శనివారం పెద్దాపురం యాసలపు సూర్యారావు భవన్‌లో ప్రారంభమయ్యింది. తొలుత మన్యం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు విగ్రహానికి నర్శింగరావు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం సిఐటియు జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషబాబ్జి జెండాను ఆవిష్కరించారు. అమరవీరులు సీతారాం ఏచూరి, చుక్కన సత్యనారాయణ, బి.రాజులోవ, కామశాస్త్రి చిత్రపటాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పిం చారు. అనంతరం శేషబాబ్జి అధ్యక్షతన నిర్వహించిన సభలో నర్శింగరావు మాట్లాడారు. పోరాడి సాధించుకున్న కార్మికుల హక్కులను కాలరాస్తూ లేబర్ కోడ్లను తీసుకువచ్చి బలవంతంగా అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. 8 గంటల పని విధానాన్ని రద్దు చేసి పరిశ్రమల యాజమాన్యాలకు అనుకూలంగా విధానాలను రూపకల్పన చేస్తున్నారన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టేందుకు సమరశీల పోరాటాలకు సన్నద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రంలో సరళీకరణ, ఆర్థిక విధానాల అమలు వేగవంతంగా జరుగుతోందని, కూటమి ప్రభుత్వంలో సైతం కార్మికులకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు ఒక డిఎ ఇచ్చి ప్రచారం చేసుకుంటున్నారని, డిఎ ఉద్యోగుల జీతంలో భాగమన్నారు. గూగుల్ డేటా సెంటర్ పేరుతో గొప్పగా ప్రకటనలు ఇచ్చుకుంటున్న ప్రభుత్వం కార్పొరేట్లకు కారు చౌకగా భూములను ఎందుకు కట్టబెడుతుందో ప్రజలకు చెప్పాలని ప్రశ్నించారు. లులూ గ్రూపునకు రూ.170 కోట్ల రాయితీలు ఇచ్చి విజయవాడ పాత ఆర్‌టిసి కాంప్లెక్స్ స్థలాన్ని కట్టబెట్టడం సరికాదన్నారు. చంద్రబాబు ఎఐ గురించి మాట్లాడుతున్నారని, కానీ ఆర్థికవేత్తలు చెప్పిన దాని ప్రకారం 40 శాతం ఉద్యోగాలు కోల్పోతారని తెలిపారు. కార్మిక ఉద్యమాలతోనే వైజాగ్ స్టీల్ ప్లాంట్ 100 శాతం అమ్మాలనే కేంద్రం కుట్రలను ఎదుర్కొన్నామని తెలిపారు. సిఐటియు జాతీయ ఉపాధ్యక్షురాలు బేబీరాణి మాట్లాడుతూ 42 రోజులపాటు సమ్మె చేసిన అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం విస్మరించిందన్నారు. మున్సిపల్, పారిశుధ్య, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. కార్మిక సంక్షేమ బోర్డుని పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చి ఎన్నికల్లో గెలిచిన తర్వాత ఏడాదిన్నరైనా నిర్మాణ కార్మికుల సమస్యలను పట్టించుకోలేదని విమర్శించారు. ఈ జిల్లాకే చెందిన కార్మిక మంత్రి వాసంశెట్టి సుభాష్, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇచ్చిన హామీలను విస్మరిస్తున్నారని చెప్పారు. అనంతరం సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్.రాజ్‌కుమార్ కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. ఈ మహా సభలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.అప్పారెడ్డి, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఎం.సూరిబాబు, ఐలు జిల్లా కార్యదర్శి భాస్కర్, కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి వి.రాజబాబు, జిల్లా కోశాధికారి మలకా వెంకట రమణ, జిల్లా ఉపాధ్యక్షుడు కె.సత్తిరాజు, పద్మ, జిల్లా కార్యదర్శులు డి.క్రాంతికుమార్, ఇ.చంద్రావతి, జి.సత్తిబాబు, ఎస్.శ్రీనివాస్, డి.బేబీ, ఎస్తేరురాణి, టిఎల్.పద్మ, సిహెచ్.సత్యనారాయణ, కె.నాగు, ఎం.నాగు పాల్గొన్నారు.

నేలకొరిగిన వరి పంట

ప్రజాశక్తి - సామర్లకోట

గత ఐదు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో రైతులు తీవ్ర ఇక్కట్లను ఎదుర్కొంటున్నారు. మండల పరిధిలోని 18 గ్రామాల పరిధిలో సుమారు 560 హెక్టార్ల వరి పంట దెబ్బతిన్నట్లు అధికారులు ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. దెబ్బతిన్న పంట పరిశీలనకు శుక్రవారం కేంద్ర బృందం వస్తుందని ప్రచారం జరిగినప్పటికీ ఆ బృందం రాలేదు. మండల పరిధిలో 975.8 హెక్టార్ల వరిపంటను రైతులు సాగు చేశారు. ఎంటియు 7029 స్వర్ణ వరి పంట ఆలస్యంగా కోతలకు రానుంది. ఎంటియు 1318 రకం పంట కోతకు సిద్ధంగా ఉంది. ఈ నేపథ్యంలో భారీ వర్షాలు కారణంగా వరి పనలు నేలను అంటాయి. మెజారిటీ రైతులు 1318 స్వర్ణ రకం సాగు చేశారు. నవంబర్ 10వ తేదీ నాటికి కోతలు కోసేందుకు రైతులు సిద్ధం కావాల్సి ఉంది. ప్రస్తుతం పంట పాలు పోసుకునే దశలో ఉండడంతో వర్షాలు దెబ్బతీస్తాయని దిగుబడి తగ్గిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 7029 వరి రకం పంటకోతకు సిద్ధంగా ఉంది. పంటకు చేతికి వచ్చే దశలో వర్షం తీవ్రనష్టాన్ని తెచ్చిందని రైతులు చెబుతున్నారు. పంట నష్టానికి పరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కోతలను వాయిదా వేసుకోవాలని వ్యవసాయ అధికారి వంగపండు మురళీధర్ రైతులకు సూచించారు.



సామర్లకోటలో నేలకొరిగిన వరి పంట

కెవిఎస్ కళాశాలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - కాకినాడ

నగరంలోని శ్రీరామ్ నగర్‌లో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న కెవిఎస్ జూనియర్ కళాశాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో కళాశాల ఎదుట ధర్నా జరిగింది. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఎం.గంగాసూరిబాబు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా శ్రీనగర్‌లో కెవిఎస్, డికెవిఎస్ పేర్లు చెప్పి కళాశాల నిర్వహిస్తున్న కళాశాలపై తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గత ఐదేళ్లుగా ఎటువంటి అనుమతులు లేకుండానే ఈ కళాశాల నడుస్తుందని, అయినా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారులు కనీసం పట్టించుకోవడంలేదని విమర్శించారు. ఇప్పటికే పలు దఫాలుగా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. నగర నడిబొడ్డున అనుమతులు లేకుండా కళాశాలను నిర్వహిస్తున్నా అధికారులు పట్టించుకోకపోడానికి ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. తక్షణమే నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ఈ కళాశాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నగర అధ్యక్షులు ఎ.వాసుదేవ్, నగర నాయకులు కరుణ్, గమినివేల్, మణికంఠ, కుమార్, బ్లెసి, తేజ, దిపిక, అనుష, తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు, విద్యార్థులు

నైపుణ్యత పెంపు కోసమే పరిశ్రమల సందర్శన

ప్రజాశక్తి - జగ్గంపేట

ఒకేషనల్ విద్యార్థుల్లో నైపుణ్యతను పెంపొందించేందుకు పరిశ్రమల సందర్శన చేయడం జరిగిందని కాట్రావులపల్లి జడ్పి ఉన్నత పాఠశాల హెచ్ఎం తాతపూడి వెంకటరమణ అన్నారు. ఒకేషనల్ ఎడ్యుకేషనల్ కోర్స్‌లో భాగంగా 9వ తరగతి విద్యార్థులు శనివారం కాకినాడ పోర్టు, సామర్లకోట పరిశ్రమలు, స్థానిక రైస్ మిల్లులను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు నేర్చుకుంటున్న విద్యలో భాగంగా పరిశ్రమల నైపుణ్యాలను తెలుసుకున్నారన్నారు. పరిశ్రమల్లో జరిగే విధి విధానాల గురించి ఆయా యాజమాన్యాలు విద్యార్థులకు వివరించారని తెలిపారు. అలాగే పోర్టులో ఎగుమతులు, దిగుమతులపై పోర్టు అధికారులు వివరించారన్నారు ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది సురేఖ, డి.రజిని, ఒకేషనల్ ఎడ్యుకేషన్ ట్రైనర్లు సూరిబాబు, మణికంఠ పాల్గొన్నారు.



పరిశ్రమలను సందర్శించిన విద్యార్థులు

ఏలేరు దిగువ ప్రాంతాల్లో అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - కాకినాడ, ఏలేశ్వరం

ఈ నెల 26 నుంచి 29వ తేదీ వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఏలేరు జలాశయానికి ఇన్ ఫ్లో పెరిగే అవకాశం ఉందని, కావున దిగువ ప్రాంతాల్లో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి ఆదేశించారు. శనివారం ఇరిగేషన్, మండల ప్రత్యేక అధికారులు, తహశీల్దార్లతో ఆయన టెలీకాన్ఫెరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏలేరు ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల నుంచి ఎక్కువ మొత్తంలో నీరు చేరుతుండడంతో ప్రాజెక్టు నుంచి ఐదువేల క్యూసెక్కుల నుంచి పది వేల క్యూసెక్కుల నీరు విడుదల చేసే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏలేరు, సుద్దవాగు ప్రభావిత మండలాల్లో తాహశీల్దార్లు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. పిఠాపురం, యు.కొత్తపల్లి మండలాల్లో తహశీల్దార్లు, విఆర్‌ఒలు హెడ్ క్వార్టర్‌లోఉండి ఎటువంటి సంఘటన జరిగిన వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఎక్కడా ఏ చిన్న ఇబ్బంది జరగకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలన్నారు. ముంపు ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలను పునరావస కేంద్రాలకు తరలించాలన్నారు. అవసరమైన చోట రిలీఫ్ కేంద్రాలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. కూలిపోయేందుకు అవకాశం ఉన్న ఇండ్లలో ఉంటున్న ప్రజలను ఖాళీ చేయించి పునరావాస కేంద్రానికి తరలించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. బోట్లును సిద్ధం చేయాలన్నారు. రానున్న నాలుగు రోజులు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. చెరువులు, కాలువలు పొంగి పొర్లే అవకాశాలున్న చోట మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. బలహీనంగా ఉన్న గట్లను ముందే గుర్తించి అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ముంపు ప్రాంతాల పరిధిలో గర్భిణీలు, బాలింతలు, వృద్ధులు, పిల్లలను ముందుగానే ఆసుపత్రులకు తరలించడం తోపాటు ముంపు గ్రామాల ప్రజలను రిలీఫ్ కేంద్రాలకు తరలించాలని ఆయన ఆదేశించారు. ముంపు ప్రభావిత ప్రాంతాల్లో తాగునీటికి ఇబ్బంది లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రజలు ఇబ్బంది పడకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.



నిండుకుండలా ఉన్న ఏలేరు రిజర్వాయర్

ప్రమాద స్థాయిలో ఏలేరు నీటిమట్టం

ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు ఏలేరు రిజర్వాయర్‌కు వరద నీరు చేరడంతో నీటి మట్టం ప్రమాద స్థాయికి చేరుకుంది. ఏలేరు రిజర్వాయర్ సామర్థ్యం 86.56 మీటర్లు కాగా శుక్రవారానికి 85.58 మీటర్లకు చేరుకుంది. తుపాను ప్రభావంతో రానున్న 4 రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. రిజర్వాయర్ నుంచి దిగువకు 2275 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. రిజర్వాయర్‌లో నీటిమట్టం పెరిగితే దిగువకు మరింతగా విడుదల చేసే అవకాశాలు ఉన్నాయి. నీటి విడుదల ప్రభావంతో కిర్లంపూడి, జగ్గంపేట, గొల్లప్రోలు, పిఠాపురం, యు.కొత్తపల్లి, పెద్దాపురం మండలాలకు చెందిన పంట పొలాలతోపాటు, లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యే ప్రమాదం ఉంది.

వైద్య విద్య ప్రయివేటీకరణను రద్దు చేయాలి

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

వైద్య విద్య ప్రయివేటీకరణను రద్దు చేయాలని వైసిపి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. శనివారం స్థానిక రింగ్ రోడ్డు వద్ద వైసిపి మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్ ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో వైద్య విద్య ప్రయివేటీకరణ రద్దు చేయాలని పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైసిపికి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

సీట్ ఫామ్‌లో చెట్లకు వేలం

ప్రజాశక్తి - గొల్లప్రోలు

చేబ్రోలు పట్టు పరిశ్రమ సీట్ ఫామ్‌లో ఉన్న చెట్లకు సెరికల్చర్ అధికారులు వేలం పాట నిర్వహించారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో పిఠాపురం ఉద్యాన శాఖ అధికారి వై.రాజశేఖర్, జిల్లా పట్టు పరిశ్రమ అధికారి టి.రాజేంద్రప్రసాద్‌బాబు పాల్గొన్నారు. ఫామ్‌లో ఉన్న కొబ్బరి, కుంకుడు, చింత, పనస చెట్లకు 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఫల సాయం పొందేందుకు నిర్వహించిన వేలంలో ఓరుగంటి రాజు రూ.30,500కు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో చేబ్రోలు పట్టు పరిశ్రమ సైంటిస్ట్ ఇ.భువనేశ్వరి, ఎఎస్ఒ కె.సత్యనారాయణ, సిహెచ్ రాజేశ్వరి, రైతులు పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఏలేశ్వరం



స్థానిక లింగంపర్తి రోడ్‌లోని సాయి శంకర్ నేత్రాలయ ఆవరణలో మెగా ఉచిత నేత్ర వైద్యాన్ని ఆదివారం నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ అనసూయ నాగేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో కాకినాడకు చెందిన సూర్య ఐ కేర్, ఎల్ఐ ఫౌండేషన్ వైద్యులు, సిబ్బంది వైద్య సేవలు అందిస్తారన్నారు. ఉచిత పరీక్షలతోపాటు అవసరమైన వారికి మందులు, కళ్ళజోళ్లు అందజేస్తామన్నారు. కంటి శస్త్రచికిత్సలను ఉచితంగానే చేయించనున్నట్లు తెలిపారు ఈ అవకాశాన్ని ఏలేశ్వరం పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నష్టపరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలో దెబ్బతిన్న పంట పొలాల రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని ఎపి కౌలు రైతు సంఘం సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు డిమాండ్ చేశారు. శనివారం ఆయన మండలంలో జార్జిపేట, పోలేకుర్రు, పి.మల్లవరం, తాళ్ళరేవు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు, ఈదురు గాలులతో పంట పొలాలు నాశనం అయ్యాయని అన్నారు. ఒక్కో గ్రామంలో 20 నుంచి 30 ఎకరాలకు పైబడి పంట పొలాలు నేల నంటాయని తెలిపారు. మండలంలో సుమారు 300 ఎకరాల పైబడి పంటకు నష్టం జరిగి ఉండే అవకాశాలు ఉన్నాయని, మరో 4 రోజులు వర్షాలు పడే అవకాశాలు ఉన్నందున మురుగునీరు దిగువకు పోయేలా యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టాలని కోరారు. ఈ పర్యటనలో సంఘ నాయకులు చల్లా సంతోష్‌కుమార్, పి.సింహాచలం పాల్గొన్నారు.

వల్లభునికి రూ.2.34 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - పెద్దాపురం


మండలంలోని తిరుపతిలో ఉన్న శృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం ఒకరోజు రూ.2.34 లక్షల ఆదాయం వచ్చిందని ఆలయ కార్యనిర్వహణ అధికారి వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. వివిధ ప్రత్యేక దర్శనం టికెట్ల ద్వారా రూ.1,51,570, అన్నదాన విరాళాల ద్వారా రూ.67,918, కేశఖండన ద్వారా రూ.2360, తులాభారం ద్వారా రూ.250, లడ్డు ప్రసాదం ద్వారా రూ.12,735 వెరసి రూ.2,34,833 ఆదాయం సమకూరిందన్నారు. యాత్రికులకు ఉదయం పులిహార, మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

గిరిబాబును కలిసిన మాజీ ఎంఎల్‌సి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

వైసిపి అంగన్‌వాడీ విభాగం అధ్యక్షురాలుగా ఎంపికైన మాజీ ఎంఎల్‌సి అంగూరి లక్ష్మీశివకుమారి శనివారం నియోజకవర్గ వైసిపి కో-ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర స్థాయిలో పదవి వచ్చేందుకు సహకరించిన మాజీమంత్రి ముద్రగడ పద్మనాభం, ముద్రగడ గిరిబాబులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

కార్టూ'నిజం'



గడప దాటుతున్న కలప

యథేచ్ఛగా వృక్షాల నరికివేత

ఫారెస్ట్ రేంజి పరిధిలో అక్రమార్కులు



రాంజీని అభినందిస్తున్న వైసిపి శ్రేణులు

విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రామ్‌జీ

ప్రజాశక్తి - జగ్గంపేట

వైసిపి విద్యార్థి విభాగం ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తోట రాంజీ నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన వైసిపి రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శిగా ఉన్నారు. ఈ సందర్భంగా రాంజీకి పలువురు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాంజీ మాట్లాడుతూ పార్టీ అధినేత వైఎస్ జగన్ తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర పదవీ ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో వైసిపి మండల అధ్యక్షులు రావుల గణేష్‌రాజా, నియోజకవర్గ శ్రామిక విభాగం అధ్యక్షులు గుర్రం మహాలక్ష్మి, తదితరులు ఉన్నారు.



బాధితులకు చెక్కును అందిస్తున్న చినరాజప్ప

సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

ప్రజాశక్తి - సామర్లకోట

ముఖ్యమంత్రి సహాయన నిధి నుంచి బాధితులకు విడుదలైన చెక్కులను ఎంఎల్‌ఎ నిమ్మకాయ చినరాజప్ప అందజేశారు. శనివారం స్థానిక టిడిపి కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో 24 మందికి రూ.10.77 లక్షల విలువ చేసే చెక్కులను బాధితులకు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో హుస్సేన్‌పురం గ్రామ టిడిపి అధ్యక్షుడు చల్లా బుజ్జి, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ బడుగు శ్రీకాంత్, భీమేశ్వరాలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ కంటే జగదీష్‌మోహన్, నాయకులు అడబాల కుమారస్వామి, బలుసు వాసు, అందుగుల జార్జిచక్రవర్తి, గొల్తి సత్యనారాయణ, నిమ్మకాయల కిరణ్‌కుమార్, చుండ్రు బలరాం పాల్గొన్నారు.



ముంపు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న నాయకులు

ముంపు ప్రాంతాల పరిశీలన

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

అకాల వర్షాలతో ముంపునకు గురియైన అమీనాబాద్‌లో తూర్పుగోదావరి డెల్టా ప్రాజెక్ట్ చైర్మన్ మురాలశెట్టి సునీల్‌కుమార్, మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ వంకా కొండబాబు పర్యటించారు. డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ ఆదేశాలతో గ్రామంలో పర్యటించి తక్షణ నివారణ చర్యలు చేపట్టినట్లు వారు తెలిపారు. వర్షపు నీరు నిల్వ ఉండకుండా ఉండేలా చూడాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. ఈ పర్యటనలో సర్పంచ్ నక్కా మణికంఠ, ఇరిగేషన్ డిఇ సంతోష్‌కుమార్, కార్యదర్శి చిట్టమ్మ, విఆర్‌ఒ నాగలక్ష్మి, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు జనసేన నాయకులు ఇశ్రాయిల్ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

కాలువలో వ్యక్తి మృతదేహం

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

ఉప్పాడ హైస్కూల్ పక్కన ఉన్న ఎలక్ట్రికల్ షాప్ సమీపంలోని కాలువలో ఒక వ్యక్తి మృతదేహం లభించింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..అమీనాబాద్ గ్రామానికి చెందిన దయలపల్లి ఆంధ్రయ్య (55) శుక్రవారం రాత్రి మద్యం సేవించి ఎలక్ట్రికల్ షాప్ పక్కన ఉన్న కాలువ వద్ద పడుకొని ఉండగా శనివారం ఉదయం ఉప్పాడ పంచాయితీ స్లీపర్లు ఆంధ్రయ్యను ఎంత లేపిన స్పందించకపోవడంతో స్లీపర్లు వెళ్లిపోయారని తెలిపారు. కాసేపటి వ్యవధిలో ఆంధ్రయ్య కాలవలో పడి ఉన్నట్లు గుర్తించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కోడి పందేలపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - జగ్గంపేట, గోకవరం, పెరవలి

జగ్గంపేట మండలంలోని సీతారాంపురంలో కోడి పందేలపై శనివారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ముగ్గురిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.5,200 నగదు, రెండు కోడి పుంజులు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రఘునాథరావు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరుస్తామని ఎస్ఐ వెల్లడించారు.

గోకవరం మండలం మల్లవరంలో కోడిపందేలు ఆడుతున్న 8 మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.17 వేలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్ఐ పవన్ కుమార్ తెలిపారు. కొత్తపల్లిలో బొమ్మా బొరుసు ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద రూ.3200 నగదు స్వాధీనం చేసుకున్నారు.

పెరవలి మండలం కాపవరంలో పేకాడుతున్న ఆరుగురిని డ్రోన్ సాయంతో గుర్తించి పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.5120 నగదు, కొత్తపల్లి అగ్రహారంలో పేకాడుతున్న ఐదుగురు వద్ద నుంచి రూ.2200 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు

వ్యాన్‌ను ఢీ కొట్టిన లారీ

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక ఎడిబి రోడ్డులోని పతంజలి పామ్ టెక్ పరిశ్రమ ఎదురుగా కోడిగుడ్ల లోడ్‌తో వెళ్తున్న ఐసర్ వ్యాన్‌ను వెనుక నుంచి లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. దీంతో స్థానిక ఎస్ఐ వి.మౌనిక సంఘటనా స్థలానికి చేరుకొని హైడ్రా క్రెయిన్ సహాయంతో కేబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్‌ను బయటకు తీసి చికిత్స నిమిత్తం పెద్దాపురం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో కోడిగుడ్ల వ్యాన్ డ్రైవర్, క్లీనర్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. కోడిగుడ్లు పాడయ్యాయి. రెండు వాహనాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఈ ప్రమాదం పై కేసు నమోదు చేసి పోలీసులు ధర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ షాక్‌తో కార్మికుడు మృతి

ప్రజాశక్తి - రామచంద్రపురం

ద్రాక్షారామ భీమేశ్వర స్వామి ఆలయంలో విద్యుత్ షాకు గురై కార్మికు డు మతి చెందాడు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆర్కియాలజీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో శనివారం ఆలయంలో గడ్డిని కోస్తుండగా బియ్యంపేటకు చెందిన దొంగ భీమన్న(46) విద్యుత్ ప్రమా దానికి గురై మృతి చెందాడు. మృతుని కుమారుడు దూడలు వీరబాబు ఈ విషయమై ద్రాక్షారామం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ద్రాక్షారామ ఎస్ఐ ఎం.లక్ష్మణ్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

ర్యాంపులో విజిలెన్స్ తనిఖీలు

ప్రజాశక్తి - కొవ్వూరు

వాడపల్లి ఇసుక ర్యాంపులో రీజినల్ విజిలెన్స్ టాస్క్ ఫోర్స్ ఎడిటి కిషోర్ శనివారం రికార్డులను తనిఖీ చేశారు. జిల్లా నుంచి ఇసుక తెలంగాణ ప్రాంతానికి తరలిపోతోందని ఇచ్చిన నివేదిక మేరకు ఇసుక ర్యాంపుల్లో రవాణా వాహనాలను తనిఖీ చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. రీజనల్ పరిధిలో రెండు బృందాలు ఈ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. రోజు విడిచి రోజు వాహనాలను తనిఖీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అధిక లోడుతో వెళ తున్న వాహనాలపై కేసులు నమోదు చేస్తున్నామన్నారు. వాడపల్లి ర్యాంపులో ఇసుక తరలింపుకు సంబంధించిన రికార్డులను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. జిల్లా బోర్డర్ పరిధిలో ఉన్న మండలాలకు ఇసుక సరఫరా చేసే సమయంలో క్షుణ్ణంగా పరిశీలించిన మీదటే అనుమతించాలని సిబ్బందికి సూచించారు.

టైక్వాండో పోటీలకు 20 మంది ఎంపిక

ప్రజాశక్తి - కాకినాడ

ఈ నెల 26, 27 తేదీలలో కడప జిల్లాలో జరిగే అండర్ 19 స్కూల్ గేమ్స్ టైక్వాండో రాష్ట్రస్థాయి పోటీలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి 10 మంది బాలురు, 10 మంది బాలికలు ఎంపికైనట్లు అండర్ 19 స్కూల్ గేమ్స్ సెక్రటరీ వెంకటరెడ్డి, రామకృష్ణ, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా టైక్వాండో జిల్లా కార్యదర్శి బి.అర్జున్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన సిహెచ్.నాగచరణ్, వి.జాన్‌వెస్లీ, డిబిఎస్ఎస్.రాహుల్, జి.మణికంఠ, పి.వశిష్ట, ఎస్.అఖిల్, ఎఎస్.సాయిరాం, డిటి.జగన్, ఇ.తరుణయ్‌కుమార్, పి.ధనుష్‌తేజ, వివై.దీపిక, ఎస్.మేఘన, పి.అబిష, పిఎస్ఎస్.నిహారిక, వైఎల్ఎస్.శశిరేఖ, వి.వర్ష, కెకెఎస్.దుర్గ, జి.యశ్విత, పిఎస్ఎస్.దేవి, వై.విజయ ఎంపికయ్యారన్నారు. టీం కోచ్‌గా డిఎన్.సత్యనారాయణ, మేనేజర్‌గా వెంకన్నదొర వ్యవహరిస్తారని తెలిపారు. రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌కి వెళ్లే ప్లేయర్స్‌కి జిల్లా స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ అధికారి శ్రీనివాస్‌కుమార్, ఒలింపిక్ జిల్లా అధ్యక్షులు ద్వారంపూడి వీరభద్రారెడ్డి, సెక్రటరీ డాక్టర్ ఎలిషాబాబు, కోచ్ కెవి.సత్యనారాయణ అభినందనలు తెలిపారు.

పేదలకు ఆహారం పంపిణీ

ప్రజాశక్తి - పెద్దాపురం

మిషన్ అన్నపూర్ణ సహాయ నిధి సంస్థ ద్వారా శనివారం పట్టణ శివారులో నివసిస్తున్న బుడబుక్కల సంచార జాతులకు చెందిన 70 కుటుంబాలకు ఆహారం పంపిణీ చేశారు. కాట్రావులపల్లి గ్రామానికి చెందిన ఇజ్జపు దివ్య అందజేసిన ఆర్థిక సహాయంతో ఈ ఆహారాన్ని అందజేసినట్లు సంస్థ వ్యవస్థాపకులు దేవత రాజేష్‌కుమార్ తెలిపారు.

భద్రత కల్పించలేమా..?

భేటీ పడావో... భేటీ బచావో పేరుతో కేంద్రం, బాలికల రక్షణకు చర్యలు అంటూ రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న ప్రచారాలు అంతా ఇంతా కావు... ఇందులో భాగంగా పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ప్రజాప్రతినిధులతో పాటూ అధికారులు ఇందులో భాగస్వామ్యం అవుతున్నారు. ఈ కార్యక్రమాల్లో బాలికల రక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామంటూ నేతలు చేస్తున్న ప్రసంగాలు ప్రతి రోజూ ఏదొకమూల వింటూనే ఉన్నాము. మీడియాలో ఈ మేరకు వస్తున్న వార్తలు కూడా కోకొల్లలు. కాని పాలకులు, అధికారులు చెబుతున్న మాటలు, చేస్తున్న ప్రకటనలు మాత్రం కార్యాచరణలో కానరావట్లేదు. ఫలితంగా బాలికలకు భద్రత కల్పించలేమా? అనే ప్రశ్నకు కల్పించలేము అనే సమాధానమే వస్తుంది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో జరిగిన వరుస ఘటనలే దీనికి నిదర్శనంగా నిలిచాయి. హాస్టల్ నుంచి ఒక విద్యార్థిని, గురుకులం నుంచి మరో విద్యార్థిని బయటకు తీసుకెళ్లి అత్యాచారం చేసిన ఘటనలు తీవ్ర సంచలనం రేపాయి. ఈ రెండు ఘటనలు పరిశీలిస్తే పాలకుల వైఫల్యం ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. రెండు ఘటనల్లోనూ సిబ్బంది వైఫల్యం కనిపిస్తున్నా... దీని వెనుక ప్రభుత్వ నిర్లక్ష్యం దాగి ఉంది.

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని బిసి సంక్షేమ హాస్టల్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థినిని ఒక యువకుడు బైకుపై తీసుకెళ్లాడు. వారితో పాటూ మరో యువకుడు కూడా వెళ్లారు. బాలికను ఒక లాడ్జికి తీసుకెళ్లి అత్యాచారం చేశారు. బాలిక తల్లి కాల్ చేసిన సమయంలో గాయాలను చూసి ఆరా తీసేవరకూ హాస్టల్ సిబ్బంది సైతం గుర్తించలేని పరిస్థితి ఉంది. ఎట్టకేలకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను అరెస్టు చేసినట్టు ఈ నెల 23న ప్రకటించారు. తుని ఘటన సభ్యసమాజం తలదించుకునే విధంగా ఉంది. 62 ఏళ్ల వృద్ధుడు అభం శుభం తెలియని బాలికపై అత్యాచారానికి ఒడిగట్టాడు. దర్యాప్తులో మూడు సార్లు అత్యాచారం చేసినట్టు పోలీసులు చెబుతున్నారు. మనవరాలి వయస్సున్న బాలికపై అత్యాచారానికి దిగిన నిందితుడిని పట్టుకున్న స్థానికులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. అనంతరం పరిణామాల్లో నిందితుడు చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులు చెబుతున్నారు. ఈ మరణంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఈ రెండు ఘటనలూ హాస్టల్స్‌లో చదువుతున్న బాలికలు, వారిని చదివిస్తున్న తల్లిదండ్రుల్లో భయాందోళనలను సృష్టించాయి. ఇదే సమయంలో హాస్టల్స్‌లో బాలికల రక్షణ ఎంతనే చర్చ కూడా వచ్చింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న హాస్టళ్లు, గురు కులాలు, కస్తూరిబా పాఠశాలలను నేటికీ సిబ్బంది కొరత వేధిస్తుంది. మెజారిటీ వసతిగృహాల్లో రక్షణ చర్యలు శూన్యం. కనీసం వాచ్‌మెన్ లేని పరిస్థితులూ ఉన్నాయి. భవనాలకు సైతం రక్షణ లేని పరిస్థితి. కొన్ని హాస్టళ్లకు ప్రహరీలు కూడా లేవు. మరికొన్ని హాస్టళ్లలో వార్డెన్లు లేరు. ఈ నేపథ్యంలో బాలికల రక్షణ ఎలా సాధ్యమవుతుంది అనేది ప్రశ్న. ప్రభుత్వాలు బాలికా విద్యకు ప్రాధాన్యత ఇస్తామని చెబుతున్నా.. బడ్జెట్‌లో మాత్రం దీనికి సంబంధించిన కేటాయింపులు అరకొర మాత్రమే. ఏదైనా ఘటన జరిగినప్పుడు సంబంధిత హాస్టల్ వార్డెన్లు, లేదా ఇతర సిబ్బందిని సస్పెండ్ చేసి చేతులు దులిపేసుకోవడం పరిపాటిగా మారింది. కాని మూలాలను గుర్తించి వాటికి పరిష్కారం చూపడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయనే విమర్శలు ఎక్కువగా ఉన్నాయి. జరిగిన ఘటనలను పరిగణలోకి తీసుకుని ఇప్పటికైనా బాలికల రక్షణకు చర్యలు చేపట్టాలని కోరుకుంటున్నారు విద్యార్థులు తల్లిదండ్రులు.



డబ్బే పరమావధిగా పనిచేస్తున్న ప్రయివేటు ట్రావెల్స్ యాజమన్యాలు. ప్రయాణికులు భద్రతను గాలికొదిలేసి ఇష్టాను సారంగా వ్యవహరిస్తున్నాయి. వారి ప్రాణాలను పణంగా పెట్టి వ్యాపారాలు సాగిస్తున్నాయి. రెండు రోజుల క్రితం కర్నూలులో జరిగిన దుర్ఘటన ఈ విమర్శలకు మరో సాక్ష్యంగా నిలిచింది. ఈ ఘటన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోనూ విషాదాన్ని నింపింది. డాక్టర బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలేనికి చెందిన శ్రీనివాసరెడ్డి ఈ ఘటనలో సజీవ దహనమయ్యాడు. భార్య, ఇద్దరు పిల్లలతో పాటూ వృద్ధులైన తండ్రి, మావయ్య అందరూ శ్రీనివాసరెడ్డిపైనే ఆధారపడి జీవిస్తున్నారు. కుటుంబ పోషణ నిమిత్తం శ్రీనివాసరెడ్డి క్రేన్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. విధుల్లో భాగంగా బెంగళూరు వెళ్తూ ఈ ప్రమాదానికి గురయ్యాడు. దీంతో వారి కుటుంబం వీధిన పడింది. చిన్నారులైన ఇద్దరి పిల్లలతో శ్రీనివాసరెడ్డి భార్య రోధిస్తున్న తీరు అందర్నీ కంట తడిపెట్టించింది. ప్రయివేటు ట్రావెల్స్‌పై అధికారులు ఆజమాయిషీ లేకపోవడం, ముడుపులు ఇతర కారణాలతో చూసీచూడకుండా వదిలేయడంతో ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయనేది బహిరంగ రహస్యం. ఇప్పటికైనా అధికారులు, పాలకులు గుణపాఠం నేర్చుకుని ప్రయాణికులకు భద్రత కల్పించాలని కోరుకుందాం.

మొంథా తుపాన్ పట్ల అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - యంత్రాంగం

పిఠాపురం మొంథా తుపాను కాకినాడ సమీపంలో తీరం దాటే అవకాశం ఉన్నందున అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని ఆర్‌డిఒ ఎస్.మల్లిబాబు, పాడా పీడీ చైత్రవర్షిణి ఆదేశించారు. శనివారం పాడా కార్యాలయంలో యు.కొత్తపల్లి మండల అధికారులతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో అధికారులంతా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. అధికారులంతా క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉండలన్నారు. మత్స్యకారులు సముద్రంలోకి చేపల వేటకు వెళ్ళకుండా చర్యలు తీసుకోవాలన్నారు. **సామర్లకోట** తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో రైతులు అప్రమత్తంగా ఉండాలని మండలం వ్యవసాయ అధికారి వంగపండు మురళీధర్ సూచించారు. శనివారం మండలంలోని వికె.రాయపురం, బోయిన పూడి గ్రామాల్లో ముంపునకు గురియైన పొలాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో 560 హెక్టార్ల వరి పంట దెబ్బతిన్నట్లు చెప్పారు. రాబోయే మూడు, నాలుగు రోజులు వర్షం ప్రభావం తీవ్రంగా ఉండే అవ కాశం ఉన్నందున రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వరి కోతలను వాయిదా వేసుకో వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ సర్పంచ్ గొల్లపల్లి సర్వేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు కుర్రా రాజు, రైతులు పాల్గొన్నారు. **గొల్లప్రోలు** తుపాను నేపథ్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం జరిగింది. మండల ప్రత్యేకాధికారి ప్రియంవద, తహశీల్దార్ రాంకుమార్, ఎంపిడిఒ ఎన్.సెలెట్ రాజు ముందస్తు చర్యలపై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. **తాళ్లరేవు** గత 4 రోజులుగా కురుస్తున్న వర్షాలతో దెబ్బతిన్న పంట పొలాలను పెద్దాపురం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు ఎ.సీతారామశర్మ, సుజాత శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. మండలంలో ఇప్పటివరకు 252 మంది రైతులకు చెందిన 184 ఎకరాల పంట నష్టం గుర్తించినట్లు ఎఒ ప్రశాంతి తెలిపారు. ఇంకా నష్టం పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ పరిశీలనలో టిడిపి మండల అధ్యక్షుడు ధూళిపూడి బాబి, ప్రియాంక, తేజేశ్వరి, రైతులు పాల్గొన్నారు. **జగ్గంపేట** తుపాన్ ప్రభావంతో వరి కోతలను వాయిదా వేసుకోవాలని మండల వ్యవసాయాధికారి నరసింహం సూచించారు. శనివారం మండలంలోని రామవరంలో పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడారు. రాబోయే 2, 3 రోజుల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించిందన్నారు. ముందుగా నాటిని వరి పొలాలు కోత దశకు వచ్చినా వర్షాలు తగ్గేవరకూ కోతలను వాయిదా వేసుకోవాలని సూచించారు. **కాకినాడ** మొంథా తుపాన్ ఈ నెల 28న కాకినాడ సమీపంలో తీరాన్ని తాకే అవకాశం ఉండటంతో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని నగరపాలక సంస్థ కమిషనర్ కెటి.సుధాకర్ ఆదేశించారు. శనివారం జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మొంథా తుపాన్ ఈ నెల 27వ తేదీ సాయంత్రం లేదా రాత్రికి కాకినాడ సమీపంలో తీరం దాటే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే 26వ తేదీ నుంచే ప్రభావం కనిపించే అవకాశం ఉన్నందున ప్రతి విభాగం సిద్ధంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ కె.శ్రీనివాసరావు, ఎస్ఇ పి.వెంకటరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

దబ్బ కాలువ పరిశీలన

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని కాండ్రకోటలో ఉన్న ఏలేరు దబ్బ కాలువను ఆర్‌డిఒ శ్రీరమణి పరిశీలించారు. తుపాను నేపథ్యంలో ఏలేరు ఉధృతుని దృష్టిలో పెట్టుకుని ఏలేరు రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి ఆమె పలు సూచనలు చేశారు.



అధికారులతో మాట్లాడుతున్న ఆర్‌డిఒ

100 పడకల ఆసుపత్రికి స్థల పరిశీలన

ప్రజాశక్తి - పెద్దాపురం

పట్టణంలో వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప శనివారం పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో వంద పడకల ప్రభుత్వాసుపత్రి నిర్మాణానికి కృషి జరుగుతుందన్నారు. ఆసుపత్రి నిర్మాణానికి అవసరమైన స్థల పరిశీలన చేపట్టామన్నారు. ఈ ఆసుపత్రి నిర్మాణానికి సుమారు మూడు ఎకరాల స్థలం అవసరం ఉంటుందన్నారు. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిని చేర్చి ఉన్న రెవెన్యూ స్థలాన్ని ఈ ఆసుపత్రి నిర్మాణం కోసం పరిశీలించామన్నారు. ఈ పర్యటనలో ఆర్‌డిఒ శ్రీరమణి, మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబు రాజు, నాయకులు తూతిక రాజు, రంది సత్యనారాయణ పాల్గొన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంఎల్‌ఎ చినరాజప్ప

వరుస చోరీలతో ప్రజల్లో ఆందోళన

ప్రజాశక్తి - సామర్లకోట

మండలంలోని హుస్సేన్‌పురం గ్రామంలో వరుసగా జరుగుతున్న చోరీలతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ నెల 7న గ్రామ శివారులో పుప్పాల వెంకట్రావు, ఆసాపు కృష్ణలకు చెందిన షాపులలో అర్ధరాత్రి సమయంలో కిరాణా సరుకులు, వంటనూనె, పంచదార దొంగలు ఎత్తుకుపోయారు. శుక్రవారం రాత్రి మళ్లీ అదే షాపుల్లో దొంగతనానికి ప్రయత్నం జరిగింది. గ్రామ యువకులు అప్రమత్తమై దొంగలను పట్టుకునేందుకు ప్రయత్నించగా, ముగ్గురు దొంగల్లో ఒకరిని పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. మిగిలిన ఇద్దరు దొంగలు పరారయ్యారు. చోరీకి పాల్పడిన వారు సామర్లకోటలోని అమ్మనమ్మ అపార్ట్‌మెంట్స్‌కు చెందినవారుగా గ్రామస్తులు గుర్తించారు. గతంలో ఎత్తుకుపోయిన సరుకులను పట్టణంలోని ఒక హోల్‌సేల్ షాపులో అమ్మినట్లు పట్టుబడిన దొంగ వెల్లడించాడు. ఇప్పటికే గతంలో జరిగిన చోరీపై పోలీసులు దర్యాప్తు చేస్తుండగా తిరిగి అదే షాపులో చోరీకి యత్నించడం విశేషం. రాత్రి సమయంలో పోలీసు గస్తీ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



చోరీకి పాల్పడిన వ్యక్తిని పట్టుకున్న గ్రామస్తులు

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - గొల్లప్రోలు

ఇటీవల మృతి చెందిన చేబ్రోలు గ్రామానికి చెందిన బాలింతరాలు శ్రీదుర్గ కుటుంబాన్ని జడ్‌పి వైస్ ఛైర్మన్, ఆదర్శ్ కళాశాల ఛైర్మన్ బుర్రా అనుబాబు శనివారం పరామర్శించారు. పుట్టిన పాపకు సకాలంలో సరైన వైద్యం అందించాలని, ప్రభుత్వ సహకారం అందేలా చూస్తానని అన్నారు. పాప ఆరోగ్యం కోసం రూ.25 వేల చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కళాశాలలో సిబ్బందికి కష్ట సమయాల్లో ఆదుకునేందుకు తాను ఎప్పుడూ ముందుంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ బుర్రా అనురాధ, డైరెక్టర్ బుర్రా అఖిలేష్, ప్రిన్సిపల్ డాక్టర్ వి.శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ ఎం.సుబ్బారావు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.



ఆర్థిక సాయాన్ని అందిస్తున్న అనుబాబు

వర్షాలకు రహదారులు ఛిద్రం

ప్రజాశక్తి - జగ్గంపేట

గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రహదారులు ఛిద్రంగా మారాయి. జగ్గంపేట శివారు జగన్ కాలనీలో రహదారులు మట్టి రోడ్లు కావడంతో వర్షాలకు అధ్వాన్నంగా మారాయి. ప్రధాన రహదారి గుంతల్లో నీరు నిలిచిపోవడంతో కాలనీ వాసులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. రహదారులు బురదమయం కావడంతో ద్విచక్ర వాహనాలు జారిపోయి ప్రమాదాల భారిన పడుతున్నామని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారుల్లో సిసి రోడ్లను నిర్మించాలని కాలనీవాసులు కోరుతున్నారు.



చింతడిగా మారిన రహదారి

డివిజన్‌లో 106.7 మిల్లీమీటర్ల వర్షం

ప్రజాశక్తి - పెద్దాపురం

డివిజన్ పరిధిలోని 11 మండలాల్లో శనివారం 106.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. కోటనందూరులో 44.2, రౌతులపూడిలో 26.6, ఏలేశ్వరంలో 1.2, జగ్గంపేటలో 10.2, కిర్లంపూడిలో 0.8, ప్రత్తిపాడులో 3.4, తొండంగిలో 3.9, పెద్దాపురంలో 12.0, గండేపల్లిలో 6.4 మిల్లీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదయింది.

చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయండి

ప్రజాశక్తి - సామర్లకోట

సుప్రీం కోర్ట్ చీఫ్ జస్టిస్ గవాయిపై దాడికి నిరసనగా వచ్చే నెల 1న నిర్వహిస్తున్న చలో హైదరబాద్‌ను జయప్రదం చేయాలని ఎంఆర్‌పిఎస్ జిల్లా ఇన్‌ఛార్జ్ పసుపులేటి చినబాబు, అధ్యక్షుడు అనంతవరపు రాజు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక పెన్షన్‌లో పట్టణ అధ్యక్షుడు మల్లెల మహేష్ ఆధ్వర్యంలో దండోరా జండా ఆవిష్కరణ జరిగింది. ఈ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయ వ్యవస్థపై జరుగుతున్న దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పి జిల్లా అధ్యక్షులు వల్లూరీ సత్తిబాబు, ఎంఆర్‌పిఎస్ నాయకులు వల్లూరు నాని, వేలంగి సత్తిబాబు, మందపల్లి వెంకన్న, చింతాడ రామకృష్ణ, మల్లెల సత్తిపండు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు దాతల వితరణ

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని నీలపల్లి పంచాయతీ మోకావారిపేట మోడల్ ప్రైమరీ పాఠశాలకు దాతలు నోటు పుస్తకాలు, పుస్తకాల ర్యాక్‌ను అందజేశారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో పాఠశాల పూర్వపు ఉపాధ్యాయులు సిహెచ్.భాస్కర సీతారామమూర్తి జయంతి సందర్భంగా ఆయన కుమారులు రవికృష్ణ, రమణారావు వాటిని అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం సిహెచ్.వీర్రాజు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో సీతారామమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు చిట్టూరి కలికిమూర్తి, ఉప సర్పంచ్ వస్కారెడ్డి, ఎస్ఎంసి ఛైర్మన్ శ్రీదేవి, సిఆర్‌పి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైసిపి ప్రజా ఉద్యమ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - గొల్లప్రోలు

వైద్య విద్య ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి చేపట్టిన ప్రజాఉద్యమ పోస్టర్‌ను ఆ పార్టీ నాయకులు శనివారం ఆవిష్కరించారు. చేబ్రోలు గ్రామంలో జరిగిన ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి ఉలవకాయల నాగలవరాజు, వైసిపి మండల అధ్యక్షులు అరికెల రామయ్యదొర పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఓరిగంటి ప్రసాద్, ఏడిద నరేష్, ఓరుగటి వెంకటసత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

యానాం వార్తలు



అధికారులతో సమీక్షిస్తున్న ఆర్ఎఒ అంకిత్‌కుమార్

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - యానాం

ఈ నెల 28వ తేదీన మొంథా తుపాన్ యానాం - కాకినాడ సమీప తీరాన్ని తాకే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆర్ఎఒ అంకిత్‌కుమార్ ఆదేశించారు. శనివారం తన చాంబర్‌లో సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. తుపాన్‌కు సంబంధించిన ముందస్తు సన్నాహాలు, అత్యవసర చర్యలపై ఆయన ఆయా శాఖల అధికారులతో చర్చించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో కంట్రోల్ రూమ్ నెంబర్లు 0884-2321223,0884-2323200, టోల్ ఫ్రీ నెంబర్ 180042523030 నెంబర్లను సంప్రదించాలన్నారు. ఈ సమావేశంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఆర్ఎఒ

కలెక్టర్ షాన్‌మోహన్ సగిలిని శనివారం కలెక్టరేట్‌లో ఆర్ఎఒ అంకిత్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలను చర్చించారు. యానానికి సహాయ సహకారాలు అందించాలని కోరినట్లు అంకిత్‌కుమార్ తెలిపారు.

సుబ్బారావుకు ఘన నివాళి

ప్రజాశక్తి - యానాం

రీజెన్సీ సిరామిక్స్ ఘటనలో కార్మికులకు అండగా నిలిచిన కీర్తిశేషులు మాగాపు సుబ్బారావుకు కార్మికులు ఘనంగా నివాళులర్పించారు. శనివారం స్థానిక యూనియన్ కార్యాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సుబ్బారావు పోరాట స్ఫూర్తిని కొనియాడారు. కార్మికుల కోసం పోలీస్ స్టేషన్ చుట్టూ తిరుగుతూ జైలు జీవితాన్ని అనుభవించారన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.